# దాసవధ



''మీకు తెలియదు కాబోలు! మా ఆర్యరాజు ఇంద్రుడంతటివాడు. అందంలో చంద్రుడు. పరాక్రమంలో దేవేంద్రుడు. అబ్బో! చాలా చాలా గొప్పవాడు.

మంచుకరిగిన నిర్మల జలాలతో నిండిన పరుష్ణి, శతద్రు, విపాశ వంటి నదుల్ని అవలీలగా దాటగలడు. తన ఆవులను, గుర్రాలను సైన్యాన్ని కూడా లోతైన నదులు దాటించి ముందుకు నడిపించగలడు.

మా ఆర్య రాజు అంత గొప్పవాడు తెలుసా?''

''బాకా బాగానే ఊదుతున్నాడు. ఇంకా ఏమి చేయగలడు. ఆపావెందుకు ఇంకా చెప్పు'' వ్యంగ్యధోరణిలో

---

దాసవధ

దాసస్య వర్చినః సహస్రాణి శతావధీ!! రెండవ మండలం పధ్నాలుగవ సూక్తం ఆరవ మంత్రానికి అర్థం అందరికీ తెలుసు! ఇది ఋగ్వేదమంత్రం! దాసవధ అనేది హిమపర్వత పాదభూముల్లో నవ వాస్తులయిన ఆర్యులకు పరమావధి అట!?

---

ఉసిగొలిపాడు పణకుడు.

''లక్షలాది మంది దాసజనాలను తుదముట్టించాడు. ఆర్యరాజుల్లో అంతమంది దాసజనాలను చంపినఘనుడు మరొకడులేడంటే మీరంతా నమ్మితీరాలి''

''ఇంతకూ ఆ మహానుభావుడి పేరేమిటో చెప్పవమ్మా!''

''దివోదాసు''

''అతన్ని గుక్కతిప్పుకోకుండా కీర్తించే నీ పేరేమిటో?''

''నా పేరు సరమ'' అన్నదా సుందరి తీయని కంఠస్వరంతో.

''ఆర్య రాజు అంత గొప్పవాడా?''

''అసలు ఆర్యరాజులందరూ గొప్పవారే! ఎవరికి ఎవరు తక్కువ? ఒకరిని మించిన వారొకరు. రాక్షస జనాలను తుసుమాడుతున్నారు. పోటీపడి పార్వతేయ ప్రజల్ని చంపుతున్నారు'' అన్నదామె గొప్పగా.

''స్థానికులైన పర్వతప్రజలు పార్వతేయులు. యక్ష రాక్షస కిరాత జాతులువారు. వారి స్వంత భూముల్లో వారు బతుకుతున్నారు. వారిని ఆర్యులు పోటీపడి చంపడం ఎందుకు? అకారణంగా కృష్ణయోనులైన పార్వత ప్రజలను చంపే ఆర్యులను నువ్వు అంతగా కీర్తించటం ఎందుకు?

''ఇదంతా అకారణ వైరం కదా??'' అని ఎదురు తిరిగి ప్రశ్నించాడు పణకుడు (వ్యాపారి).

ఈమాటలువిని కత్తివేటు తగిలినదానిలా అయింది

లల్లాదేవి



సరమాదేవి ముఖం.

''దాసులను అనగా దస్యులను ఎంతమందిని చంపితే అంత గొప్పగా భావిస్తారు మా ఆర్యజనులు'' అన్నదామె.

''అలాచేయడంలో ఉన్న ఔచిత్యమేమిటో కొంచెం వివరిస్తావా?'' అని నియవరించి అడిగాడు పణికుడు.

స్వార్థం నిండిన ఆలోచనల్లో ఔచిత్యాన్ని గురించిన స్పృహ ఎందుకుంటుంది. అవసరం అలా అనిపించిందామెకు. హిమ సానువులు మనుషులను ముఖ్యంగా పార్వతేయగణాలను బ్రతికించాయి చాలాకాలం. ఇంకా బ్రతికిస్తున్నాయి. జాగా చాలని వారు దిగువకు చేరుతున్నారు.

సింధుతట వర్తులై సంచరిస్తున్నారు. అడవులను దగ్ధంచేసి మైదానాలను ఏర్పరుచుకుంటున్నారు.

ఆర్యావర్తాన్ని అరణ్య ప్రాంతంగా కాక జనావాస యోగ్యంగా మార్చుకుంటున్నారు. హిమ సానువుల నుంచి మంచుకరిగి మైదానాలమీదికి నదులు దిగి వస్తున్నాయి.

అలాగే హిమపర్వతాలనించి భరత ఖండంలోకి మానవ నాగరికతా స్రవంతి ప్రవహిస్తోంది. అది సహజంగా జరుగుతున్న మానవ చరిత్ర వికాసం! ఆ సహజత్వం మీద గొడ్డలిపెట్టు ఆర్యుల రాక.

ఆర్యులది సంచార జీవనం. ఆర్యులకు ఆయుధ సంపత్తిమెండు. సైనికబలం హెచ్చు. వారిది యుద్ధ ప్రవృత్తి. మరొకరిని దోపిడీ చేయటం వారివిధానం. ఆక్రమించుకోవటం వారికి ఆనందం. దానికి వారు ఘనంగా పెట్టుకున్న పేరు దిగ్విజయం. వారికి నావలు లేవు కానీ నదుల్ని తరించే విధానాలున్నాయి. వారు శక్తిమంతులే కానీ స్వార్థపరులు. స్థానికులైన యక్ష రాక్షస కిరాత గణాల వారు కృష్ణయోనులు. లింగపూజకులు. పితృస్వామ్యం కాదు. అది ప్రకృతి నిర్దేశించిన ప్రజాతంత్రం. గణతంత్రం!!

కావలసినంత జాగా సంపాదించుకోవటానికి స్థానికులను వధిస్తున్నారు. అందులో ఔచిత్యాల ప్రస్తావన ఒకటి ఉందని వారెందుకు గుర్తిస్తారు.

యక్షరాక్షస కిరాత గణాలకు హిమావర్తము ఆర్యావర్తము అనే ఇరువురు తల్లులున్నారు.

బిడ్డల్ని చంపి తల్లుల్ని వేరపడుతున్నారు ఆర్యులు. ఔచిత్యాల గురించి వారెందుకు ఆలోచిస్తారు.

జయించినవారిదే రాజ్యం అనే సిద్ధాంతానికి ఊపు ఇస్తారు. ఎందుకంటే వారు జయించగలవారు కాబట్టి. ఇక్కడ పుట్టి ఇక్కడ పెరిగి ఈ మట్టిలో కలిసి పోతున్నాము. కాబట్టి ఈ భూమి మాది అనే పార్వతేయుల తపన ఓటమిని రుచిమాస్తోంది. బలవంతునిదే కదా రాజ్యం!?

బలహీనుడు బానిస అవుతున్నాడు. జయించడానికి ఉపాయాలను కుటానీతిని కూడా ఆశ్రయిస్తారు వారు. మోసానికి సిద్ధాంతాలను వ్రాసి విబద్ధంచేస్తారు. అటువంటి సమయంలో పరమ పణికునికి సరి అయిన సమాధానం ఇవ్వవలసిన అవసరం ఏముంది?

''ఓయీ ! పణికా! ఓడిపోయేవారు ఔచిత్యాన్ని గురించి వెర్రికేకలు పెట్టుకుంటారు. బలవంతునిదే

రాజ్యం. జయించినవారిదే చరిత్ర! వారిదే న్యాయం'' అందామె.

''జయించాలంటే ఇద్దరి మధ్యా సంఘర్షణ జరగాలి కదా!''

''అవును జరగాలి''

''దానికి కారణం ఉండాలి కదా!''

''అక్కరలేదు. ఆక్రమించుకునేందుకు వచ్చాం. ఈ భూమిలో నదులు మా ఇంద్రునికి దారి ఇస్తున్నాయి.
అతని ఆశీస్సులతో మా రాజులు చొచ్చుకువస్తారు. అదే కారణం అనుకోవాలి మీరు. తలవంచి అంతటితో సరి పెట్టుకోవాలి''

''సరమా! నీవు చెప్పే మాటలు ఏ దేవుడూ పట్టించుకోలేదు కాబట్టి నువ్వింకా బ్రతికి ఉన్నావు.

ఇంతకూ నువ్వు ఏం చేస్తున్నావిక్కడ!''

''మా రాజు దివోదాసు గోవులను పాలింపుతున్నాను''

''గోపాలకివన్నమాట''

''అవును పణకా! నువ్వుకూడా చాలా సంపన్నుడిలా కన్పిస్తున్నావు. మా రాజుకి బహుమతులు ఇవ్వు. నన్ను మంచి చేసుకో! లేకపోతే నీ మీద దాడీలు చెప్పి నీ సంపదలన్నీ కొల్లగొట్టిస్తాను. తెలిసిందా!''

''నన్ను తక్కువగా లెక్కించకు సరమా! నీవు రాజుగారి గోపాలికవు అయితే గణపాలకుడయిన వర్చి అనే మహావీరునికి వణిగ్వరుడను (వ్యాపారి) నేను.

నీతో వ్యాపారానికి ఒప్పుకుంటాను. కానీ కర్రపెత్తనం చేస్తానంటే ఒప్పుకోను''

''ఏం చేస్తావేమిటి?''

''తిరిగి వెళ్ళి మా రాజుకు చెప్తాను'' అన్నాడు పణకుడు.

''నువ్వు తిరిగి వెళ్లగలిగితేకదా మీరాజుకు చెప్పగలుగుతావు''

''అంటే?''

''నిన్ను ఈ క్షణమే నేను బందీని చేస్తున్నాను. నిన్ను నా దాసునిగా స్వీకరిస్తున్నాను. నీ దగ్గరున్న గోవులు, గుర్రాలు, రత్నాలు అన్నీ స్వాధీనపరుచుకుంటున్నాను.

నిన్ను ఆయసేపురాలకు తీసుకుపోయి వీధుల్లో వేలం వేయిస్తాను. ఇప్పుడైనా అర్థమైందా ఏం చేస్తానో'' అన్నది సరమ. పణకుడు వణికిపోయినాడు.

అతనికి ముచ్చెమటలు పోశాయి. తలఎత్తిచూశాడు.

అప్పటికే ఇషు నిషంగములను, ధనుస్సులను ధరించిన ఆర్యభటులు అతన్ని చుట్టుముట్టి ఉన్నారు. కొందరి చేతుల్లో మొనతేలిన రాళ్ళున్నాయి.

కొందరి చేతుల్లో లోహపు ములుకులున్నాయి. వాటన్నింటినీ అతని మీదకు గురి పెట్టి ఆర్యభటులు మోహరించారు.

సరమ చాలా గర్వంగా అతని వంక చూసింది.

'ఆర్యులశక్తి ఏమిటో ఇప్పుడు అర్థమైందా?' అంది.

''అయితే నన్నువధిస్తారా?'' అన్నాడు పణకుడు భయంగా.

''లేదు. వధించను'' ప్రశాంతంగా అంది సరమ. చుట్టూ మోహరించిన ఆర్య భటులు ఆయుధాలను దించేశారు. పణకుని గుండెలు కుదుట పడినాయి.

''పణకా! నిన్ను నేను వధించను. నీ దగ్గరున్న గోవులను గుర్రాలను, రత్నాలను తీసుకుని వదిలేస్తాము. నీవు తిరిగిపోయి మీ రాజుతో చెప్పు. దివోదాసు కొద్ది దినాల్లో మీ ఆయసే పురాలమీదికి దండుతో వచ్చి జయిస్తాడు.

ముందుగా లొంగిపోతే క్షమిస్తాడు. మా శక్తిని అతని దగ్గర వర్ణించి యుద్ధంలేకుండా లొంగిపోయేలా చెయ్యాలి. అందుకోసమే నిన్ను ప్రాణాలతో వదిలేస్తున్నాను'' అంది సరమ.

''నీవు ఇపుడు చేసింది దారిదోపిడీ. చెయ్యిబోయేది దురన్యాయం'' అంటూనాపోయాడు పణకుడు.

పెద్ద పెట్టున నవ్వింది సరమ. ఆర్యుల బానిసలూ నవ్వారు.

''ఓయీ! వెర్రి పణకుడా! దాన్ని నువ్వు దారి దోపిడీ అంటావో, దురన్యాయం అంటావో మరింకేమని పిలుస్తావో నాకు అనవసరం. నేను జయించాను. అది నాకు ప్రధానం. నీవు ఓడిపోయావు అది నువ్వు గుర్తించక తప్పదు. కాబట్టి నేను చెప్పినట్లు వినటం తప్ప నీకు మరొక మార్గాంతరం అనేది లేనేలేదు. ఓం తత్సత్!'' అందామె. అంతే మాటలు ముగిశాయి.

ఉన్నదంతా పోగొట్టుకొని కనీసం ఎక్కి వెళ్లేందుకు గుర్రమైనా లేక, బయలుదేరాడు. ఎండకు కాళ్ళు కాలకుండా ఆముదపు ఆకులు చుట్టుకున్నాడు.

నెత్తి మాడకుండా తామరతూడుల్ని చుట్టి కిరీటంలా పెట్టుకున్నాడు. ఎంతో ఆయాసపడి ఒక ఆయసీ పురంచేరుకున్నాడు. అక్కడున్న కృష్ణభాగినులు అతనికి సాయం చేశారు.

ఎలాగో కష్టపడి గణపతి అయిన వర్చి సముఖానికి చేరుకున్నాడు పణకుడు. ఆయాసంతో రొప్పుతున్నాడు. భయంతో వణుకుతున్నాడు. బాధతో మూలుగుతున్నాడు. నానా హైరానాపడుతూ అతని పాదాల మీద వాలాడు. అతని స్థితి చూచి విభ్రాంతుడయ్యాడు వర్చి.

ఆయసేపురాల మధ్య తిరుగుతూ సంపదలు పెంచే వ్యాపారి పణకుడు అలా రావటం ఏమిటి?

ఆయసేపురా (రాతితోకట్టిన నగరాలు)లు అన్నింటిలో అతని బంధువులు మిత్రులు, అభిమానులు, బానిసలు ఉన్నారు. అన్నింటికి మించి అతనివద్ద అశేష ధనసంపదలు, గోసంపదలు, అశ్వసంపదలు, రత్నాలు, వసువులు, అనేకం ఉన్నాయి. అతడే ఒక వసువు అనుకోవాలి.

అలాంటి మహనీయుడు ఇలా రావటమేమిటి అని అబ్బురపడి పోయినాడు వర్చి గణపాలకుడు.

సేవలు చేయించి సేద తీర్చాడు.

''ఓ యీ! పణకా! గోవులేమైనవి? గుర్రములేమయినవి? రత్నరాసులేమయినవి? వసులు ఏమయినవి? పాదచారివై నిర్ధనుడవై దిక్కుమాలిన వానిలా వచ్చినావేమి?'' అని ప్రశ్నించాడు.

''గణపాలకా! వర్చీ! ఏమని చెప్పనయ్యా! ఆర్య రాజయిన దివోదాసుకు హిమావర్తంలోని నదులన్నీ దారి ఇచ్చాయి. కిరాతభూములు రుద్రవాటికలవుతున్నాయి. అతడు కృష్ణయోనులందరినీ జయించి బానిసలుగా చేస్తున్నాడు. అతని స్వార్థం ఎంతగా పెచ్చుమీరిందంటే ఆర్యుడై వుండి ఆర్యులమీదే యుద్ధాలు చేస్తున్నాడు.


యక్షరాక్షస కిరాతులు అతని ఉద్దతికి తలవంచి దాసోహమంటున్నారు. దాసులవుతున్నారు. బానిసలవుతున్నారు. రాతికట్టుబడితో ఉన్న ఆయసేపురాలు సైతం నేల మట్టమవుతున్నాయి. ధన, రత్న, కనక, గో, అశ్వ సంపదలన్నింటినీ కొల్లగొట్టి తీసుకుపోతున్నాడు.

ప్రస్తుతం అతని చూపు మన నగరాలమీద పడింది దానికి మొదటి కబళంగా నా సంపదలన్నీ దోపిడీ అయినాయి. అక్రమంగా పడి దోచుకోవడానికి వారు పెట్టిన పేరు యుద్ధం! దోపిడీ నిరాఘాటంగా చేయగలిగితే దాన్ని ధర్మ విజయమంటున్నారు. మనం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే పతనం తప్పదు'' పరిస్థితిని వివరించాడు పణకుడు పాలిపోయిన ముఖంతో.

ఇతఃపూర్వమే ఈ మాటలను కర్ణాకర్ణిగా తిలకించుతున్న వర్చిరాజు రవంతసేపు నిరుత్తరుడు అయాడు.

గురుపదవిలో కూర్చుని ఉన్నవారి వంక తల ఎత్తి చూచాడు. వారిలోంచి ఒక గురువృద్ధుడు లేచాడు.

''వర్చీ! ఈవార్తలలో ఆలోచించవలసిన అంశాలు చాలా ఉన్నాయి. కానీ అనుమానించవలసినది ఏమీ లేదయ్యా! ఆర్యుల చూపు మన ఆరామాలపై వచ్చిందంటే మనం చేయగలిగినది కూడా ఏమీ లేదు. ఇదివరలో ఆర్యుల దండు తరలివచ్చిన కిరాత యక్ష రాక్షస



భూములన్నీ స్మశానాలు అయినాయి. అదే చరిత్ర మళ్లీ పునరావృతం అవుతుంది.

ఈ సమస్య ఇంతటితో తీరేదిలా లేదు. మనంలింగ పూజారులం. వారు ఇంద్ర భక్తులు.

మనదేవుడు ఊహామూర్తి వారి నాయకుడు ఓ శక్తి మంతుడైన సేనాని! భౌతికమైన ఈ వాస్తవానికి పరిణామం ఏమిటో కాలమూ, భావితరాల చరిత్ర చెప్పవల సిందే!'' అన్నాడు. తనజాతి భవితవ్యాన్ని నిర్దేశించే ఈ సమస్యకు సరి అయిన తరుణోపాయం చెప్పగలిగినవాడు ఎవరా అని ఆలోచనలో పడిపోయాడు వర్చి గణపతి!

** ** **


అశక్ని నది గలగలా జాలువారుతోంది.

హిమసానువుల్లో మంచు కరిగిననీరు నిర్మలంగా వచ్చి జలధారలతో ఐక్యమవుతోంది. మైదానాలు లేత లేత శాద్వలాలతో పచ్చగా పరుచుకుపోయి కనుచూపు మేర దూరం అందంగా కన్పిస్తున్నాయి.

ఆవేదనా పూర్ణమైన ఆలోచనల వల్ల వర్చి గణపాల కునికి శరీరమంతా చిరుచెమటలు క్రమ్ముతున్నాయి. హిమగిరుల నించి వచ్చే శీతపవనాలు సైతం అతని ఆ యాసాన్ని తగ్గించలేకపోతున్నాయి.

ఆ వేళ అశిక్ని జలధారల మధ్య నడుములోతు నీటిలో నిలబడి ఉన్నాడొక ఋషి. ఉదయించే కర్మసాక్షికి స్వాగతం పలుకుతున్నాడు. అర్ఘ్యమిచ్చి లోకబాంధవునికి అంజలి ఘటించాడు. అతనిరాకకై ఎదురుచూస్తూ తీరాన నిలిచిపోయినాడు వర్చి గణనాయకుడు.

సంయమి అర్పణలు అంజలులు సమర్పించి తిరిగి




పద్మం.

''నమోవాకాలు ఋషిరాజా!'' ప్రణమిల్లినాడు వర్చి.

''ఎవడోయీ నీవు?''

''వర్చి గణపాలకుడను''

''ఓహో కృష్ణయోనుల గణపతివా? వర్చి అనే పేరు నేను విన్నాను. అ వీరుడవు నీవేనా? మీ నాయకుడు శంబరుడు సుఖంగా ఉన్నాడా?''

''ఇంతవరకూ క్షేమంగానే ఉన్నారు''

''అనగా నీ ఉద్దేశ్యము?''

''ఆర్యరాజులు దండుతో వస్తున్నారట కదా!'' అన్నాడు వర్చి. ఈ మాటలు విని మందస్మితం చేశాడు సంయమి.

ఆ దరహాసం ఆనంద భాసురంకాబోలు!! ఎంత పక్షపాతం?

''స్వామీ! మీ పవిత్ర నామం అడగవచ్చునా!''

''లేకేమి నాయనా! నా పేరు శంయువు''

''ఓహో శంయు ఋషిచంద్రులు మీరేనా? మీ నామధేయము మీ మహత్తు తెలియనివారు సింధు తీర వాసుల్లో ఎవరున్నారు?''

''కాంత, కనకము, కీర్తికండూతి అన్నీ వదులుకున్న సంయమిని''

''ఋషిరాజా! ఆర్యులకెందుకు ఈ ఆక్రమణ కాంక్ష?''

''నాయనా! స్వార్థమనేది మానవజాతికి మౌలికమైన లక్షణము. చారెడునేల అయినా శక్తి కలవానిదేకదా!''

''ఋషీ! శక్తి ఉన్నది. ఆయుధాలున్నవి. యుద్ధ తంత్రమూ ఉన్నది. అలా అని నిర్దోషులైన స్థానికులు



(వాస్తులు)ను నవవాస్తులు అని తూలనాడవచ్చునా?

మా భూములు ఆక్రమించి, మా వస్తువులు కొల్లగొట్టి, మమ్మలను చంపి లేదా బానిసలుగా విక్రయించి పరాభవాలు పాలుచేస్తున్నారు ఆర్యులు. ఇది ధర్మమా?''

''నాయనా ప్రాణాపాయం వచ్చినపుడు ధర్మాధర్మ విచక్షణ చేయకూడనిది. ఆకలిగొన్న పులిపంజాలో చిక్కిన లేడికూన ఎంత జాలిగా ఏడ్చినా ఏమి ప్రయోజనం.

దాని ధర్మాధర్మ విశ్లేషణ ఎవరు వింటారు? ఎవరు పట్టించుకుంటారు? నా మాట విని నువ్వు ప్రాణలను రక్షించుకునే ఉపాయం ఆలోచించుకో!''

''నన్ను నమ్ముకున్న వారందరినీ విడిచి పారిపొమ్మంటారా?''

''అందరినీ తీసుకుని పారిపో! మరొక నదీ తీరాన అడివిని తగులబెట్టి ఆవాసం ఏర్పాటుచేసుకో అదే నీ కర్తవ్యం''

• ''ఇది తప్పిదమని మీరు ఖండించలేరా?''

''ఖండించటం సాధ్యపడదు''

''కారణం?''

''ధర్మశాస్త్రాలు జయించిన వారికోసం బలవంతుల కోసం వ్రాయటం జరుగుతుంది కాని బలహీనుల కోసం కాదు''

''అయితే ఇపుడు నాకేమిటి దారి?''

''జయించగలననుకుంటే యుద్ధం చెయ్యి. లేదనుకుంటే పారిపో!''

''విజయమో వీరస్వర్గమో అన్నారు కదా మరి?''

''అది ఆర్యులకుమాత్రమే! ఆర్యులు యుద్ధంలో ఓడి చనిపోతే అది వీరస్వర్గమవుతుంది. దాస్యుడు యుద్ధంలో చనిపోయాడనుకో అది రాక్షసవధ ధర్మ సంస్థాపన అవుతుంది''

''ఇది ఏమి న్యాయం ఋషీ!''

''శక్తిశాలి అయిన వాడే న్యాయ నిర్ణేత. జయించిన వారికే ధర్మం! బలవంతునిదేరాజ్యం. వారికి అనుకూలంగానే ధర్మశాస్త్రాలు ఆవిష్కరణమవుతాయి. నాకు పూజాసమయం అవుతోంది. మరింక తర్కించకు'' అన్నాడు శంయుమహర్షి. వినేందుకు బాధాకరమైనా అతను నిజాన్ని వచించాడు. సత్యం వద!!

ఎవరు ఏమి వ్రాసినా ఏమి చెప్పినా జరిగింది జరుగుతుందీ జరుగనున్నది అదే! త్రికాల సత్యమది!

ఆశ్వాన్ని అదలించి ప్లుతగతిలో ఆయసేనగరం (రాతి కట్టుబడి చేసినపట్నం) చేరుకున్నాడు వర్చి.

తన ప్రజలందరినీ పిలిచి మాట్లాడుకున్నాడు. పరిస్థితి అంతా తనవారికి వివరించి చెప్పుకున్నాడు.

''ఈపరిస్థితిలో యుద్ధంలో మరణించటమా? దక్షిణాదికి వలసవెళ్ళి నదీతీరాలలో అరణ్యాలను తగులబెట్టి ఆవాసయోగ్యంగా మార్చుకోవడమా? ఏది ఉచితం'' అని అడిగాడు.

''కొండలు అడ్డు వచ్చినపుడు నదులు తమ గతిని మార్చుకుంటాయి. ఒక స్రవంతికూడా అలాగే మార్గాంతరాన్ని అన్వేషించుకుని మనుగడ సాగించుకోవాలి' అంటూ హితవచనం పలికారు గురుదేవుడైన ఒక వృద్ధ మూర్తి.

కానీ ఆ హితవచనం జనగణాలకూ నచ్చలేదు. జనగణమిక నాయకుడైన అధినాయకుడు వర్చికీ రుచించలేదు. హితవచనాలన్నీ ప్రియవచనాలు కాలేవు.

యుద్ధం అనివార్యమైంది.

రణభేరులు మ్రోగినాయి. మూరువేలమంది వర్చి గణనాథునికే సమీకృతమైంది.

అంతకన్నా అధికమైన ఆర్యగణాలు తరలి వచ్చినాయి. వారికి ఆయుధాలు కూడా ఉన్నాయి. ఆధునాతనమైన లోహపు ములుకుల ఆయుధాలు అవి.

దుడ్డు కర్రలతో రాతిగదలతో వారిని ఎదుర్కోవడం సాధ్యపడదు కదా మరి.

వర్చి గణపాలకుని ఆధీనంలో ఉన్న పద్దెనిమిది ఆయసీ పురాలను ఆర్యసేనలు ముట్టడించాయి. చిత్ర విచిత్ర ధర్మాలూ, ప్రబోధాలు మెదడుకు ఎక్కించుకుని తన్మయత్వంలో వివశత్వంతో ఉన్నారు వారంతా! అదంతా అంకిత భావం అయింది.

శంబరుడు వంటి ఉజ్వలుడైన నాయకుని సందేశాలను వర్చిగణపాలకుని ద్వారా విన్నారు అనార్యగణాలు మా భూమి మాకే ఉండాలి అన్న నినాదం వారిది. వారి నినాదాలు పెటిల్లుమని కొండకొమ్మల్ని ఢీకొంటున్నాయి.

వర్చి తన పురాలన్నింటికి వేరుగా బలగాలను పెట్టాడు. కానీ అవన్నీ కూలిపోతున్నాయి. పరిస్థితి చిల్లి పడవలా అయింది.

వివిధ నగరాలనుంచి వచ్చిన వార్తలు విని నీరసించిపోయాడు. ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఆర్యసేనల అశ్వాల కాలిగిట్టల క్రింద ద్రవిడజాతులు నలుగుతున్నాయి.

వారి ఆయుధాలన్నీ రక్త ధారలతో తడిసిపోతున్నాయి. సింధు, పరూష్ణి, అశిక్నీ నదులు అనార్యరక్తంతో ఎర్రగా అయినాయి.

''వర్చీ! ఇంక ఆలోచించి ప్రయోజనం లేదు. వెంటనే నీవు స్వయంగా యుద్ధానికి సమాయత్తం కావాలి. ఆర్యుల దురాక్రమణ యజ్ఞంలో అనార్యులంతా సమిధ అవుతున్నారు'' అంటూ యువకులు వెర్రికేకలు పెట్టారు.

ప్రతీకార వాంఛతో వారంతా ఉన్మాదులు అయ్యారు. ఆయుధం కలవాని మీద ఆయుధంలేనివాడు పోరాడలేడు. కానీ ఈ వాస్తవాన్ని వారు ఆవేశంతో విస్మరించారు. యుద్ధానికి సమాయత్తం అయ్యారు. మూరువేల మంది సింధుజనం తిరగబడింది. రక్త ప్రవాహాలు నదీ ప్రవాహాలైనాయి. ఆర్యసైనికుల ఆకలి తీరుతోంది. ద్రవిడముూకల తలలు కందుకాల్లా దొర్లుతున్నాయి.

మిగిలి ఉన్న జాతి జనులను రక్షించుకొనేందుకు సమాయత్తుడైనాడు వర్చి! వచ్చి ఆర్యనాయకుని ఎదుట నిలిచాడు.

''ఓ యీ! రక్తపిపాసీ! రక్తయజ్ఞం చాలించు'' అన్నాడు.

''పరాజయం అంగీకరిస్తావా వర్చీ!''

''అందుకు గుర్తుగా నీ కరవాలంతో నా శిరసు ఖండించు''

''నీవు ఎదిర్చి నిల్చిన రణభూమిలో జరుగనున్నది అదే!''

'కానీ నీవు చరిత్రహీనుడవు కాగలవు గుర్తుంచుకో!''

''ఎన్నటికీ కాదు. జయించిన వానిదేచరిత్ర! వానిదే కీర్తి!''

''నీవు దురాశాపరుడవుకాకుండా ఎలా పోతావు''

''దీని పేరుదురాశకాదు. దురాక్రమణ కాదు. ఇది యుద్ధ విజయం. ధర్మవిజయం. నేను విజేతను'' అంటూ కరవాలాన్ని గురిమాచి వర్చి గణపాలకుని తలను ఖండించాడు. బంతిలా నేల మీదకు దొర్లి పడింది.

మొదలు నరికిన మ్రానులా అతని శరీరం క్రిందికి ఒరిగిపోయింది. ఎవరి క్షణాల్లో శంయు మహర్షి చెప్పిన మాటలను స్మరించినాడు వర్చి గణపాలకుడు.

''ఆకలికొన్న పులి పంజాలో చిక్కిన లేడిపిల్ల ధర్మచర్చ చేయరాదు చేసినా ఎవరు వింటారు? ఎవరు పట్టించుకుంటారు??''

(అయిపోయింది)

